


అటు ఇష్టం.. ఇటు కష్టం..



- సర్పంచ్ పదవిపై మోజుతో బరిలోకి పలువురు
- ఎన్నికల ఖర్చుకు సరిపడా డబ్బులు లేక వెతలు
- సర్దుబాటుకు తీవ్ర ప్రయత్నాలు
- చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. పోటీకి సై అంటున్న అభ్యర్థులు

వాంకిడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఊరికి ఒక్కసారైనా సర్పంచ్ కావాలనే కల చాలా మందికి ఉంటుంది. ప్రథమ పౌరుడిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశతో ఎన్నికల్లో పోటీకి ఏళ్లతరబడి అవకాశం కోసం ఎదురు చూస్తున్న వాళ్లు ఉన్నారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీల పరిధిలో 2,874 వార్డులు ఉన్నాయి. జిల్లాలోని మొత్తం 15 మండలాల్లో మొత్తం 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు, 20 మంది ఇతరులు ఉన్నారు. పాత రిజర్వేషన్లను రోటేషన్ పద్ధతిలో మారుస్తూ రిజర్వేషన్లను ఖరారు చేశారు. చాలా మందికి రిజర్వేషన్లు కలిసి వచ్చాయి. రిజర్వేషన్లు అనుకూలించని వారు తమ భార్య, తల్లీ, కూతురులను బరిలో దించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మొదటి విడతల ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తి అయింది. సర్పంచ్ కావాలనే కల కళ్ల ముందు ఉన్నా... ఖర్చులను చూస్తే అభ్యర్థులకు దడ మొదలవుతుంది. సర్పంచ్‌గా పోటీ చేయాలని ఆశ..కాని ఖర్చులను భరించేందుకు పైసలు ఎట్లా అనే మీమాంసలో అభ్యర్థులు ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసి వచ్చి పోటీకి ఉత్సాహం ఉన్నా చేతిలో చిల్లిగవ్వలేక ఆశావహులు నిరాశలో ఉన్నారు. తాజామాజీ సర్పంచ్‌లకే చేసిన పనులకు బిల్లులు రాక ఇంకా అవస్థలు పడుతున్నతీరు.. పోటీదారులకు అప్పు చేయడానికి మనుసుఒప్పుకోవడంలేదు. ప్రధాన పార్టీల మద్దతు కావాలన్నా... నీ చేతిలో ఎంత ఉందో ముందు చెప్పు.. అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. దీనికి తోడు రియల్ బూమ్ లేకపోవడం, పంటల ఆదాయం అంతంతే ఉండడంతో అభ్యర్థులను కాసుల కష్టాలు వెంటాడుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ మొదటి విడత పూర్తై రెండవ విడిత ప్రారంభం కావడంతో నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు తెలిసినోళ్లందరికి ఫోన్లు చేస్తూ నీ దగ్గర ఏమైనా ఉంటే సర్దుబాటు చేయమంటూ పడరాని పాట్లుపడుతున్నారు.

● పోటీ సరే..కాసులెలా..?

అసెంబ్లీ, పార్లమెంట్, సర్పంచ్.. ఏ ఎన్నికైన కాసులతో ముడిపడి ఉంది. ప్రచారంలో ప్రత్యర్థులకు ధీటుగా రంగంలో ఉండాలంటే క్యాడర్ అభ్యర్థి వెనుక నిలబడాలంటే ప్రతి రోజు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఖర్చు చేయకుంటే క్యాడర్ తమ వెంట ఉండరన్న భయంతో అభ్యర్థులకు ఖర్చుల టెన్షన్ పట్టుకుంది. ఎన్నికల్లో బ్యానర్లు, వాల్ పోస్టర్లు, ప్రచార వాహనాలు, రోజువారి క్యాడర్ ఖర్చు, పోల్‌మేనేజ్‌మెంట్, వీటన్నింటికి తోడు మందు, మాంసం సమకూర్చల్సి ఉంటుంది. ఇలా ఎన్నికల వ్యయం తడిసిమోపెడు అవుతుందనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. వెయ్యి ఓట్ల లోపు గ్రామ మైతే తక్కువలో తక్కువగా రూ. 5 నుంచి రూ. 8 లక్షల వరకు ఖర్చు అవుతుందనే అంచనాల్లో ఉన్నారు. పెద్ద పంచాయతీల్లో ఖర్చు 20 లక్షలకు పైగా ఉంటుందనే చర్చ జరుగుతుంది. మరోవైపు ఏకగ్రీవం ఆశావాహులను ఊరిస్తోంది. ఎవరితో పోటీ లేకుండాప్రచార లొల్లి, ఖర్చుల బాద లేకుం డా సర్పంచ్ సీటులో కూర్చోవచ్చనని ఉవ్విళ్లురు తున్నవారు కూడా ఉన్నారు. అయితే ఏకగ్రీవం పేరుతో ఊరి అభివృద్ధికి, పోటీ నుంచి తప్పుకు నేవారికి, చివరికి ఓటర్లకు దావత్ ఇలా ఖర్చుల మీద ఖర్చులు తప్పవనే ప్రచారం ఉంది. ప్రతీ పనికి పైస కవాల్సిందే. పంచాయతీ ఎన్నికల్లో పైసా లేనిది ప్రచారం లేదని.. క్యాడర్ ఉండరనే ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారు. దీంతో చేతిలో చిల్లీ గవ్వ లేకున్నా.. మద్దతుదారుల ప్రోత్సహంతో సర్పంచ్ బరిలో దిగుతున్న అభ్యర్థులను కాసుల కష్టాలు కలవరపెడుతున్నాయి. జనరల్ స్థానాల్లో ఖర్చు మరింత ఎక్కువ ఉండే అవకాశం ఉండడంతో అభ్యర్థులు ప్రత్యర్థులకు దీటుగా వ్యూహరచనలు చేస్తున్నారు.

● కలవర పరుస్తున్న పరిస్థితి..

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తు న్నాననే ఆనందం ఒకవైపు..ఎన్నికల ఖర్చులకు అప్పు ఎట్లా అనే ఆందోళన మరోవైపు అభ్యర్థులను కలవర పరుస్తున్న పరిస్థితి నెలకొన్నది. తెలిసినోళ్లం దరికి ఫోన్ చేసి అప్పుకోసం బతిమిలాడాల్సి వస్తుంది. అన్నా...సర్పంచ్ ఎన్నికల్లో నిలబడ్డా నా వద్ద ఐదారు లక్షలున్నాయి.నీదగ్గర ఐదో ఆరో లక్షలు ఉంటే సర్దు అన్నా... ఎన్నికలయ్యాక ఎట్లనో తేర్పుతా అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. అభ్యర్థులు వడ్డీ వ్యాపారులను కూడా ఆశ్రయిస్తు డబ్బులు తీసుకుంటున్నారు. కొంత మంది నెలనెలా వేసిన చిట్టీలను పాడి సిద్ధం చేసుకుంటున్నారు. కొంత మంది తమకు ఉన్న కొంత మేర సాగు భూము లను సైతం అమ్ముకోవడానికి సిద్ధం అవుతున్న ట్లు ప్రచారం జరుగుతోంది. కాగా ఎన్నికల్లో ప్రచారం, విందులు, మందు, డబ్బు పంపకాలకు ఎక్కువ ఖర్చు అవుతుందని, మరింత భారం పడనుందని ఓటర్లను మచ్చిక చేసుకుని సంతృప్తి పరచడానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆశావహులు వాపోతున్నారు. ఇంత ఖర్చు చేసినా.. విజయం వరిస్తుందా..? లేదా ? అని మరికొందరు ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

తనిఖీలు నిర్వహించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ నితికా పంత్

వాంకిడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వ్దద విధి నిర్వహణలో ఉన్న అధికారులు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. వాంకిడి మండల సరిహద్దులోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మద్యం, ఇతర సామగ్రి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్ పోస్టు వద్ద బారికేడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. విధులలో ఉన్న సిబ్బంది సరైన డిప్యూటీ రోస్టర్ ప్రకారం క్రమబద్ధంగా పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో అక్రమంగా డబ్బు, అక్రమ మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణా అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. చెక్ పోస్టు వద్ద డ్యూటీలో ఉన్న అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వాహనం, వ్యక్తిని కచ్చితంగా తనిఖీ చేసిన తరువాతనే వదిలి పెట్టాలని చెప్పారు. అనుమానస్పద వ్యక్తులు, వాహనాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆమె వెంట సీఐ సత్యనారాయణ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం హత్తినిలో కాంగ్రెస్ పార్టీలో పలువురు ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో చేరారు. గ్రామానికి చెందిన రాకేష్, భారతి, సాయిరాజ్, సుదర్శణ్, రవితో పాటు మరో వంద మంది ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు ప్రాంతంలో పులి సంచారం



పులి అడుగులను గుర్తిస్తున్న అటవీశాఖ అధికారులు

బెజ్జూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా బెజ్జూరు మండలంలో పులి సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని కృష్ణపల్లి- హేటిగూడ గ్రామాల మధ్య పెద్దవాగులో సోమవారం పులి పాదముద్రలు కనిపించడంతో ఆ వైపు వెళ్లిన ప్రజలు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ రేంజ్ అధికారి ముసావీర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్, సెక్షన్ అధికారి సోఫియా పెద్దవాగు ప్రాంతానికి వెళ్లి పాదముద్రలు పరిశీలించారు. పెద్దవాగు నుంచి పులి అడుగులు అనుసరిస్తూ వెళ్లారు. సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు గ్రామాల్లో డప్పు చాటింపు వేయించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

దహెగాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. దహెగాం మండలంలోని లగ్గాం, దహెగాం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 వచేచ వరకు ఆరబెట్లాన్నారు. ప్యాడీ క్లీనర్‌లో తూర్పార బట్టి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గన్ని సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ దత్తారావు, తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఏపీఎం ప్రకాష్, సీఈఓ బక్కయ్య ఏఈవో అధిత్య తదితరులు పాల్గొన్నారు.

బాలల చిత్రాన్ని ప్రారంభించిన ఎంఈవో

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఆదివాసీ భవనంలో సోమవారం ఎగిరే తారాజువ్వలు అనే బాలల చిత్రాన్ని ఎంఈవో సుభాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు బాలల చిత్రాన్ని ప్రదర్శించామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు దేవభూషణం, రాధాకృష్ణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాంనాయక్

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌కు మందు లేదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సీతారాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సోమవారం నిర్వహిచిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధికి చికిత్సలేదన్నారు. నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది వినయక్, వినోద్, అజ్మత్, వాసుదేవ్, డెమోమార్త, శ్యాంలాల్, రాజేష్, సతీష్, హరీష్, రఫీక్, రాజశేఖర్, చేతన్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుదాం



ఆసిఫాబాద్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచే అభ్యర్థులను పెద్ద సంఖ్యలో గెలిపించుకుని సత్తా చాటుదామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి, పాడిబండ గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమనే విషయం ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగు చెందిన మండల ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జగదీష్ అన్నారు. మండలంలోని తెలండి గ్రామ పంచాయతీలో గల కోతెలండి గ్రామానికి చెందిన దిందర్శ, రాజు, జైత్, తిరుపతి, సోనీరావు, గుణవంతరావు, అర్జున్, భగవంత్‌రావు, గంగారాం, శంకర్,మెంగారావుతో పాటు 50 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మండలంలో పార్టీని బలోపేతనం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీనివాస్, చంద్రశేఖర్, సుజాత, లచ్చన్న, మల్లేష్, శంకర్, మధుకర్, దేవేందర్, సంతోష్, లక్ష్మణ్‌గౌడ్, కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సిర్పూర్(టి), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో పోలీసులు అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల పరిధిలో జిల్లా ఎస్పీ ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. సిర్పూర్(టి)- మాకిడి రోడ్డు, వెంకట్రావుపేట పోడ్సా వంతెన వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ నెల 14, 17 తేదీల్లో రెండు విడతలలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలకు ఓటర్లను ఆయా పార్టీల వారు ప్రలోభాలకు గురి చేసి వారికి మహారాష్ట్ర నుంచి దేశీదారు మద్యం, డబ్బులు ఇతర సామాగ్రి రావాణా కాకుండా పోలీసులు ఇతర సిబ్బంది సమన్వయంతో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. ఇప్పటికే నామినేషన్ పర్వం కొనుసాగుతుందని డీఎస్పీ వహిదుద్దీన్, డీఎస్పీ సురేష్, ఎస్సై సురేష్‌లు మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు పెంచడంతో పాటు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా పోలీసులు మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి పోడ్సా వంతెన గుండా తెలంగాణలోకి వచ్చే ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ నెల 14న జరిగే పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, నాయకులు పోలీసు శాఖకు సహకరించాలని కోరుతున్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

జైనూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యతి): ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జైనూర్ సీఐ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయన ప్రధాన వీధుల్లో ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు సోమవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ఏర్పా టు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. ఇతర ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గొడవలు చోటు చేసు కోకుండా చూడాలని చెప్పారు. ఎవరైన ఇబ్బం దులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి ప్రజలు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జైనూర్, సిర్పూ ర్(యు), లింగాపూర్ ఎస్సైలు రామకృష్ణ, ఉల్లాస్, గంగన్న, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణానికి కృషి

బెజ్జూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో బస్టాండు నిర్మాణానికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు, ప్రజలు అందరు సహకరిస్తే బస్టాండు నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రతినిత్యం పదలు సంఖ్యలో బస్సులు వచ్చి రోడ్లపై నిలుపుతున్నారన్నారు. మండల ప్రజలందరు బస్టాండు నిర్మాణం కోసం సహరిస్తే బస్టాండు నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. బస్టాండ్ నిర్మాణంతో పాటు మౌలిక వసతులు సైతం కల్పిస్తామన్నారు. బస్టాండు కోసం ప్రజలందరు కలిసి తీర్మానం చేస్తే బస్టాడు నిర్మాణం కోసం వెంటనే నివేదికలు ప్రభుత్వానికి పంపించి పనులు చేపడుతామని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ రాజశేఖర్ అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు రవాణా పరంగా ఇబ్బం దులు కలుగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీసీ పోశం, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు నిపుణుల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో సోమవారం ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చే కార్యక్రమాలు పాఠశాలలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నెల 8వ తేదీలోగా అన్ని ప్రధాన మంత్రి శీర పాఠశాలలో నిపుణులతో కెరీర్ గైడెన్స పై కౌన్సిలింగ్ అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలి తెలిపారు. గ్రూప్-1 అధికారులు, ఇతర అధికారులు తాము ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించిన తీరు, పోటీ పరీక్షలకు సన్నద్ధమైన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆ దిశగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు భవిష్యత్‌ను బంగారు మయంగా మలుచుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎస్ఓ దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పటాన్ చెరువులో ఈ నెల 25 నుంచి 29 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాణించిన విద్యార్థులను సోమవారం పలువులు అభినందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులుపాల్గొని మంచి ప్రతిభకనబర్చి బంగారు పతకం సాధించినట్లు డీఐఈవో, ప్రిన్సిపాల్ రాందాస్ తెలిపారు. కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్ఓ అశ్వక్ అహ్మద్, కోచ్‌లు సాగర్, అరవింద్, రవికుమార్, రాకేష్, యాదగిరి, శ్రీనివాస్, సంతోష్ అభినందించారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు

రెబ్బెన, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తామని సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ గోవర్ధన్ అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స హాల్‌లో సోమవారం ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంపీఎఫ్ లావాదేవీలు అన్ని సీకేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్య వర్తులు లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని చెప్పారు. సీఎంపీఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు, పెన్షన్ రివైజ్డ్ పెన్షన్‌పై అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. దరఖాస్తులు పెండింగ్ ఉడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ హెచ్‌వోడీ ఎం శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సీఎంపీఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం తనిఖీ

కౌటాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కౌటాల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు అశ్వక్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులతో నామినేషన్ పత్రాల స్వీకరణ పై ఏమైనా సందేహాలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రెండో రోజు నామినేషన్ల జోరు

సిర్పూర్(టి), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 14 వార్డులకు సంబంధించిన మేజర్ గ్రామ పంచాయతీలో రెండవ రోజు సోమవారం పోటా పోటీగా సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్‌లు దాఖలు చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు వర్గీయులు అంజనాబాయి సర్పంచ్ స్థానానికి తన నామినేషన్ దాఖలు చేయగా ఎమ్మెల్సీ దండె విఠల్ వర్గీయులు ఆయన ఆశీర్వాదం తీసుకుని వడ్డె నాగమణి సర్పంచ్ స్థానానికి నామినేషన దాఖలు చేశారు. దీంతో పాటు 14 వార్డులకు పోటా పోటీగా నామినేషన్ దాఖలు అయ్యాయి.

కనీస వేతనం చెల్లించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలనిప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వెంటనే నూతన టెండర్లు పిలిచి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిబ్బంది ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, నరేష్, కృష్ణ, రాజయ్య, గంగన్న, కమల తదితరులు పాల్గొన్నారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష



- చలికాలంలో నారుమడులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- రాత్రిపూట నీరు తీసి.. ఉదయం నింపాలి
- యజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు

కౌటాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు వరి నారు మడులు తయారు చేస్తున్నారు. వరి పంట సాగులో భాగంగా నారుమడి తయారు చేయు రైతులు చలికాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి, ఉదయం సమయాల్లో ఉష్ణోగ్రత తీవ్రత పూర్తిగా పడి పోతుంది. అందువల్ల నారు మడిలో నీరును మారుస్తూ నీటి యజమాన్యం పాటించాలి. దీంతో చలి నుంచి నారుమడిని కాపాడుకోవచ్చు. నారు ఆరోగ్యంగా పెరిగితేనే పంట దిగుబడి వస్తుంది. అందువల్ల నారుమడ్ల యజమాన్య పద్దతులు పాటించాలి.

నారుమడి తయారీ..

రెండు గుంటల నారుమడికి రెండు క్వింటాళ్ల కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీకంపోస్టును వేసి కలియదున్నాలి. ఈ సేంద్రియ ఎరువులను నారుమడుల్లో వాడడం వల్ల చలి తీవ్రతలో కూడా నారుకు పోషకాలు అంది ఎదగుదలకు తోడ్పడుతుంది. లేదంటే రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 1 కిలో పొటాష్‌ను వేయాలి. యాసంగిలో వరి పంట వేయాలనుకునే రైతులు స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడం ఉత్తమం. ఎదుకంటే నీటి లభ్యత పంట కాలం ఎక్కువైతే సమస్యలు ఎదురవుతాయి. అదే విధంగా వడగండ్లు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉంటుంది.

మండలంలో నారుమడుల తయారీలో ఉన్న రైతులకు ఈ చలికాలంలో తీసుకోవల్సిన సూచనలను మండల వ్యవసాయాధికారి తెలిపారు.

చలితో జింక్ లోపం..

చలి అధికమైనప్పుడు జింక్ లోపం వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల నారుమడిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. మొలక కట్టిన విత్తనాన్ని నారు మడిలో మొదటి వారం రోజుల పాటుగా తక్కువగా ఉంచాలి. రాత్రి ఉష్ణోగ్రత్తలు 12 డిగ్రీలకు కంటే తక్కువ ఉన్నప్పుడు నారు ఎదుగదు. కొన్ని సార్లు వరి చని పోతుంది. దీని కోసం రసాయన ఎరువు లను వినియోగించాలి. చలి సమస్యను అధిగమనిం చడానికి వరి మడ్లపై టార్పాలీన్‌లు రాత్రి పూట ఉంచి ఉదయం పూట తీసి వేయాలి. రాత్రి పూట వరి మడి నుంచి పూర్తిగా నీరు తీసి వేసి ఉదయం పూట తాజా నీటిని నింపాలి.

దీంతో వరి ఎదుగు దలలో లోపం లేకుండా ఉంటుంది. కాండం తొలిచే పురుగు (మొగ్గ పురుగు) నుంచి పంటను కాపాడుకోవడానికి నారు తలలు తుంచి నాటు వేసుకోవాలి. దీంతో కాండం తొలిచే పురుగు నారు కోనలపై గుడ్లు పొదుగుతుంది. దీని వల్ల గుడ్లతో పాటు మొగ్గ పురుగును నివారించవచ్చు. నారు తీసే వారం రోజుల ముందు ఎకరా నారుమడికి 1 కిలో కార్బొ ఫ్యూరో త్రీజీ లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ పోర్‌జీ గుళికలను వేసుకున్నట్లయితే నాటు వేసిన నెల రోజుల వరకు కీటకాలు ఆశించకుండా పంటను రక్షించుకోవచ్చు.

ఎకరానికి 30 నుంచి 35 కిలోలు..

ఎకరానికి 30 నుంచి 35 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బెం డిజనతో విత్తన శుద్ధి చేయాలి. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు. నిద్రా వ్యవస్థలో ఉన్న విత్తనాలను మేలుకొల్పడానికి కిలో విత్తనానికి 10 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి. పశువుల పేడగాని, సేంద్రియ ఎరువును ఎకర నారుమడికి 100 నుంచి 200 కిలోల నత్రజనిని, కిలో పొటాషియంను చల్లాలి. విత్తనాలు విత్తిన 15 రోజులకు 2 కిలోల భాస్వరం వేసుకోవాలి.

అధికారుల సలహాలు పాటించాలి..
ప్రేమలత, వ్యవసాయాధికారి, కౌటాల



పంటల సాగులో అధికారుల సలహాలు పాటించాలి. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడులో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారు మడిని కాపాడుకోవడానికి వ్యవ సాయాధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే నాటు ఏపుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

చెరువులో పడి యువకుడి మృతి

మంచిర్యాల క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హమాలివాడ చట్టి పోచమ్మ చెరువులో పడి అకోజు రాజు (38) అనే యువకుడు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై మజారుద్దీన్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజు, అతని భార్య భారతికి కొంత కాలంగా మనస్పర్థలు రావడంతో వేరుగా ఉంటున్నారు. దీంతో రాజు మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పోచమ్మచెరువు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో మృతదేహాన్ని వెలికి తీసి రాజుగా గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో లంబాడితండా(డీ) గ్రామ శివారు ప్రాంతంలోని గుడుంబా స్థావరాలపై సోమవారం దేవాపూర్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామ శివారు అటవీ ప్రాంతంలో భూమిలో నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం పానకాన్ని 50 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేశారు. అందుబాటులో ఎవరు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. దేవాపూర్ ఎస్ఐ గంగారాం మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలుంటాయని తెలిపారు.

నేరస్థుల బైండోవర్



మాట్లాడుతున్న ఎస్సై స్వరూప్ రాజ్

హాజీపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నకలను దృష్టిలో పెట్టుకుని నేరచరిత్ర కలిగిన పలువురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. హాజీపూర్ గ్రామానికి చెందిన మండి మల్లయ్య, వేంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సతీష్, పడ్తన్‌పల్లి గ్రామానికి చెందిన బుచ్చన్నలను హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే సమక్షంలో బైండోవర్ చేశారు. ఏడాది కాల వ్యవధికి గాను ఆరు నెలల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమాన షరతు కింద సత్ప్రవర్తన కోసం బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలి

ఐఎన్‌టీయూసీ నాయకుల వినతి

శ్రీరాంపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్, కేంద్ర ఉపాధ్యక్షులు గరిగె స్వామి, జీవన్ జోయల్ కోరారు. సోమవారం వారు డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్‌తో సమావేశమై పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్కే 5, ఎస్ఆర్‌పీ 3, ఐకే 1ఏ, ఆర్కే 7 గనులలో కార్మికులకు ఏర్పాటు చేసిన రెస్ట్‌రూములు, టాయిలెట్లు అధ్వానస్థితిలో ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. టాయిలెట్లు క్రమం తప్పకుండా నిర్వహణ చేపట్టాలన్నారు. రెస్ట్‌హాల్స్ రేకులు పగిలి, వర్షాకాలంలో ఉరుస్తున్నాయని, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించాలన్నారు. పిట్ హెడ్ల వద్ద స్నానాల గదులు, లాకర్లు కలిగిన రూములకు తక్షణ రిపేర్లు చేపట్టాలన్నారు. ఆనంద్‌కుమార్ స్పందిస్తూ పై అధికారుల ఆమోదం పొంది పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

క్రీడాకారులకు సీఎండీ అభినందన



కబడ్డీ జట్టును అభినందిస్తున్న సీఎండీ బలరాం

మందమర్రిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోలిండియా కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను సీఎండీ బలరాం అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన కోలిండియా కబడ్డీ పోటీల్లో సింగరేణి క్రీడాకారులు అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆదివారం రాత్రి జరిగిన పోటీల్లో కబడ్డీ సింగరేణి జట్టు రెండో బహుమతి సాధించింది. సింగరేణి సీఎండీ బలరాం క్రీడాకారులను అభినందించారు. సీఎండీ మాట్లాడుతూ సింగరేణి క్రీడాకారులు ఆటల్లో రాణిస్తున్నారని తెలిపారు. కోలిండియా కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చారన్నారు. పతకాలు సాధించే క్రీడాకారులను సింగరేణి ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ట్రోఫీని అందించారు. కాగా మందమర్రికి చెందిన కబడ్డీ క్రీడాకారులు శివకృష్ణ తదితరులను సీఎండీ అభినందించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన కాస్టులో కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్‌ల కృషితోనే ఈ నెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించామని ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు నెలలో ఖైరిగూడ ఓపెన కాస్టు ద్వారా 3.53 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ అధికారి శ్రీనివాస్, ఐఈడీ ఉజ్వల మెహర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి రోల్ ప్లే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి బి.శ్రావ్య టీం, ద్వితీయ బహుమతి నౌశిక్ టీం, తృతీయ బహుమతి దినేష్ టీం సాధించగా విజేతలకు జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి పొందిన కేజీబీవీ విద్యాలయం విద్యార్థినులు శరణ్య, హరిణి, వెన్నెల, అలేఖ్య, గంగరేపులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, ప్రిన్సిపాల్ మహేష్, వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, రంగయ్య, అరుణ, నవీన్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు, ఐద్వా సభ్యులు

ఆసిఫాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం, నజ్రుల్‌నగర్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణయ గ్రామానికి 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ మహిళలతో కలిసి కలెక్టర్ దీపక్ తివారికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వినోద, నాయకులు షాహిని, సుచిత్ర సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నజ్రుల్‌నగర్ గ్రామ పంచాయతీకి కేటాయించిన మద్యం దుకాణం గతంలో పెంచికలపేట మెయిన్ రోడ్డు సమీపంలో పంచశీలనగర్‌లో ఏర్పాటు చేశారని అన్నారు. ఈ సారి 500 మీటర్ల ముందుకు వచ్చి ఇళ్ల మధ్యలో ప్రభుత్వ నిబంధనలను వ్యతిరేకంగా ఏరాపటు చేస్తున్నారని అన్నారు. మద్యం దుకాణం దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సుచిత్ర, రాణా, మమత, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన,(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలోని జనావాసాల మధ్య మద్యం షాప్ ఏర్పాటు వద్దని సోమవారం మహిళలు వైన్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జనావాసాల మధ్య మద్యం దుకాణం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతారని చెప్పారు. విషయం తెలుసుకున్న రెబ్బెన పోలీసు లు సంఘటన స్థలానికి చేరుకుని ఎన్నికోడ్ ఉన్న కారణంగా ఎలాంటి ఆందోళనలు చేపట్టకూడదని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు వేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

తిర్యాణి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. తిర్యాణి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు డీసీసీ అధ్యక్షురాలి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.. కాగా డీసీసీ పదవీ చేపట్టిన తరువాత తొలి సారిగా తిర్యాణి మండలానికి వచ్చిన ఆమెను కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనీల్‌గౌడ్, సాగర్ పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై నేషనల్ హెరాల్డ్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీసీసీ ఆత్రం సుగుణక్క అన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ , కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతందని ఆరోపించారు. దేశ ప్రజల కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబంపై కేసులు పెట్టడం విడ్డురంగా ఉందని మండిపడ్డారు. వారిపై నేషనల్ హెరాల్డ్ కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు అనిల్‌గౌడ్, సాగర్, వెంకటేశంగౌడ్, కుమార్, రాజు, అమర్, శంకర్, విజయ్, బాపు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసి..అంతమొందించి..

- చిన్నారి హత్య కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

దండేపల్లి డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిని కురుకురే ఆశ చూపి అత్యాచారం చేసి అంతమొందించారు. వరుసకు పెద్దనాన్న అయ్యే వ్యక్తితో పాటు మరొకరు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. బాలికను హత్య చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంచిర్యాల డీసీపీ భాస్కర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గామానికి చెందిన ఏడేళ్ల బాలిక నవంబరు 24న కనిపించకుండా పోయింది. రెండు రోజుల తరవాత బాలిక శవం ఓ బావిలో కనిపించింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితులైన శనిగారపు బాపు, ఉపారపు సతీష్ ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఇద్దరూ ఒంటరిగా జీవిస్తున్నారు. ప్రధాన నిందితుడు బాపు భార్య ఆరేళ్ల క్రితం చనిపోయింది. మరో నిందితుడు సతీష్ భార్య కూడా అతనికి విడాకులు ఇచ్చి వెళ్లిపో యింది. సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూస్తూ మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో నవంబరు 24 సోమవారం రాత్రి బాలిక తోటి పిల్లలతో ఇంటి ముందు ఆడుకుంటోంది. బాలికకు వరుసకు పెద్దనాన్న అయిన బాపుతో పాటు సతీష్ చిన్నారికి కురుకురే కొనిసామని ఆశ చూపారు. దీంతో బాలిక వారి వద్దకు వెళ్లగానే నోరు మూసి ఇంటి సమీపంలో ఉన్న ఉన్న పత్తి చేనుల్లోట ఎత్తుకెళ్లి అత్యాచారం చేశారు. ఆపై నేరం బయటపడుతుందని భయంతో బాలిక గొంతునొక్కి హత్య చేసి వంద మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావిలో పడేసారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దండేపల్లి మండలంలోని మదాపూర్ సమీపంలో నిందితులను పట్టుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. ఈ మేరకు ఏసీపీ ప్రకాష్, సీఐ రమణ మూర్తి, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

ఉద్దేశ పూర్వకంగా ఓటు హక్కును తొలగించారు

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మారావుపేట గ్రామ పంచాయతీ నుంచి తన ఓటు హక్కును ఉద్దేశ పూర్వకంగా తొలగించారని స్థానిక లంబాడితండాకు చెందిన ఓటరు గజానంద్ నాయక్ సబ్ కలెక్టర్ మనోజ్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ధర్మారావుపేట నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చిన సబ్ కలెక్టర్‌తో గజానంద్ వాదనకు దిగాడు. గతంలో ఉమ్మడి పంచాయతీగా ఉన్నప్పుడు తన భార్య జాదవ్ లలిత ధర్మారావుపేట సర్పంచుగా పనిచేసిందన్నారు. కొందరు గిట్టని వారు చేసిన ఒత్తిడికి అధికారులు నా కుటుంబ సభ్యుల పేర్లను ధర్మారావుపేట నుంచి తొలగించారన్నారు. ఎన్నికల కోసమే ఏజెన్సీ గ్రామంలో పేర్లు నమోదు చేసుకుంటే చెల్లదని సబ్ కలెక్టర్ మనోజ్ గజానంద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండకుండా కేవలం సర్పంచు ఎన్నిక కోసమే పేర్లు నమోదు చేసుకుని రాజకీయం చేస్తాననడం సరికాదన్నారు. మీకేమైనా సమస్య ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనుల, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, మంత్రిపై అనుచిత వ్యాఖ్యలుచేస్తేఊరుకోమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తాని బాల్క సుమన్‌పేర్కొనడం హాస్యస్ప దంగా ఉందన్నారు. కాళేశ్వరం బ్యాకర్ వాటర్ ముంపు ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తే రైతులు తరిమి కొడతారన్నారు. మరోసారి మంత్రిపై అసత్యపు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహిం చేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముల్కల్లలో మళ్లీ ఇసుక రీచ్ ప్రారంభం

హాజీపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ముల్కల్ల శివారులోని గోదావరి తీరంలో గనులు, భూగర్భ శాఖా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ సోమవారం ప్రారంభమయ్యింది. మైనింగ్ శాఖా ఏడీ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఇసుక ట్రాక్టర్ వద్ద టెంకాయ కొట్టి రీచన్ను యదావిధిగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానులు సంయమనంతో ఇసుక రవాణా జరుపుకోవాలని సూచిస్తూ ముల్కల్ల ఇసుక రీచన్ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం

మంచిర్యాల క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో అనుమతి లేని డ్రోన్, డీజే సౌండ్లపై, బహిరంగ ప్రదేశాలలో మద్యంపై నిషేదాజ్ఞలు కొనసాగుతాయని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిగణించి మద్యం ప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడంతో పాటు ప్రజల భద్రత, రక్షణ కోసం నిషేదాజ్ఞలు కొనసాగుతాయని అన్నారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లంఘించిన వారిపైచట్ట పర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించ కూడదని, నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు.

పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

హాజీపూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండల కేంద్రంతో పాటు రాపల్లి ,టీకన్నపల్లి ,బుద్దిపల్లి, పెద్దంపేట, దొనబండ, కర్ణమామిడి ,పడ్తానపల్లి ,ర్యాలీ, ఘడ్‌పూర్, నాగారం, చిన్న గోపాలపూర్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రాలను హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ కృష్ణ రెడ్డి, మంచిర్యాల రూరలు సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ స్వరూప్ రాజ్ కలిసి సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచా యతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, సీఐ శశిధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవోకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు నామినేషన్‌ల ప్రక్రియ నుంచి ఫలితాలు వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్థానిక పోరుపై యువత గురి



- సర్పంచ్‌గా పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి
- బరిలో నిలిచేందుకు నామినేషన్లు దాఖలు చేస్తున్న వైనం

బెల్లంపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల సందడి మొదలైంది. మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ దాఖలు గడువు ముగిసింది. రెండో విడత ఎన్నికలకు నామి నేషన్ పత్రాలు స్వీకరిస్తున్నారు. గతానికి భిన్నంగా యువత పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్నారు. రాజకీయాల్లో ఉన్నత పదవులు చేపట్టడానికి తొలిమెట్టుగా భావిస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. పోటీ కోసం రంగం సిద్ధం చేసు కుంటున్నారు. ఒకవైపు ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి యువ నాయకులు చొరవ చూపుతూ మరోవైపు గ్రామంలోని ముఖ్య సీనియర్ నాయకులను కలిసి వారి ఆశీస్సు లు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. సర్పంచ్ ఎ న్నిల బరిలో నిలిచి సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

రాజకీయాల్లోకి యువకులు..

గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో యువకులు పోటీ చేసేందుకు ముందస్తుగానే రంగం సిద్ధం చేసుకొని ప్రస్తుతం ఆయా గ్రామాల్లో నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఎంతో మంది యువకులు ఎన్నికల బరిలో ఉంటున్నవారు ఉన్నత చదువులు చదివిన వారితో పాటు వివిధ వ్యాపారాల్లో స్థిరపడ్డవారు సైతం ఉన్నారు. అంతేగాకుండా ఎన్నో ఏళ్లగా వివిధ పార్టీల్లో సీనియర్ నాయకులతో కలిసిమెలిసి తిరుగుతూ రాజకీయం గురించి తెలుసుకుంటున్న యువకులు సైతం ఈ ఏడాది సర్పంచ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

గతంలో ఆయా గ్రామంలో సర్పంచ్‌లు ఎక్కువగా సీనియర్ నాయకులే ఉండేవారు. అక్కడక్కడ కొన్ని గ్రామ పంచాయతీల్లో యువత పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికల బరిలో గతంలో కంటే భిన్నంగా ఎక్కువ మంది యువత నామినేషన్ దాఖలు చేస్తున్నారు. గ్రామ సేవ చేయాలనే ఉద్దేశంతో మరికొందరు రాజకీయంగా ఎదగాలనే ఆలోచనతో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసిన యువత ఆయా గ్రామాల్లో పాలనలో పారదర్శకత, గ్రామాల్లో మౌలిక సదుపాయాలవంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలతో మమేక మవుతున్నారు.

పలువురిని ఆదర్శంగా తీసుకుంటూ..

జిల్లాలోని పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా పదవుల్లో ఉన్న నాయకుల రాజకీయ ప్రస్థానం కొంద రిది సర్పంచ్‌గా, మరికొందరిది కార్యకర్తలుగా ఎదిగి ప్రస్తానం ఉ న్న రాష్ట్ర స్థాయి నేతలను యువత ఆదర్శంగా తీసుకుంటున్నారు. రాజకీయ అరంగేట్రానికి స్థానిక సంస్థల ఎన్నికలను తొలిమెట్టుగా చేసుకుంటున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకొని సర్పంచ్ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. పోటీల్లో ఆసక్తి చూపుతున్న యువకులు ఇప్పటికే కదన రంగంలో ఉండి నిత్యం జనంలో ఉంటూ ప్రజా సమస్యలపై దృ ష్టిసారిస్తున్నారు.

కొన్నేళ్లుగా సీనియర్ నాయకులతో వివిధ కార్య క్రమాలకు వెళ్తూ ప్రజల్లో గుర్తింపు పొందేందుకు తమవంతు ప్ర యత్నం చేస్తున్నారు. మరోవైపు పల్లెల్లోని సీనియర్ నాయకుల ను మాజీ సర్పంచ్‌లు ఓటర్లను ప్రభావితం చేసే నేతలను కలుస్తున్నారు. రాజకీయంగా ఉన్నతస్థానాలకు ఎదగాలనే ఆలోచనతో పంచాయతీ ఎన్నికలను అవకాశంగా మలుచుకోవాలని ఎంతో మంది యువకులు భావిస్తున్నారు. అటు రాజకీయ హోదాను అనుభవించేందుకు అదే సమయంలో ఇటు ప్రజా సేవా చేయవచ్చునసే ఆలోచనతో యువ నేతలు సర్పంచ్ పీటంపై కన్నేశారు. దీంతో సర్పంచ్ ఎన్నికల్లో యువకులదే హవా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది.

గజగజ..

(5వ పేజీ తరువాయి)

కప్పబడి ఉండటంతో ఉదయం సమయంలో కూడా లైట్ల వెలుతురులో వాహనాలను నడపాల్సి వస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ఆయా ఏరియాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. రాత్రి వేళల్లో అధికంగా కురుస్తున్న మంచు కారణంగా చలికి వణికి పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ఏడున్నర గంటలు దాటితే తప్ప సూర్యుడు ఉదయించడం లేదు.

జిల్లాలో 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు...

జిల్లాలో సోమవారం 20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేమనపల్లి మండలం నీల్వాయిలో 20.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, కోటపల్లి మండలంలో 20.9 డిగ్రీలు, కన్నెపల్లి మండలంలో 21.4 డిగ్రీలు, చెన్నూరు మండలంలో 21.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

వేమనపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలం గొర్లపల్లి గ్రామానికి చెందిన అరిగెల ప్రభాకర్, అరిగెల సంజీవ్‌ు ద్విచక్రవాహనంపై అక్రమంగా మ్యం తరలిస్తుండగా మాటు వేసి పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. వేమనపల్లి నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో వేమనపల్లి సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మద్యం విలు సుమారు 9వేల విలువ ఉంటుందని తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని ద్విచక్రవాహనానిన సీజ్ చేసి ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని సున్నంబట్టి వాడలో ఉంటున్న శనిగరం మౌనిక(22) ఉరేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. మౌనిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మౌనిక ఇంటర్ చదువుతోంది. వీరు కొన్నేళ్ల క్రితం వేమనపల్లి మండలం లక్ష్మీపూర్ నుంచి వచ్చి ఉంటున్నారు.

నామినేషన్ల స్వీకరణ.. పకడ్బందీగా నిర్వహించాలి

భీమారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఈ నెల 3వ తేదీ నుంచి మండలంలో నామినేషషన్‌ల స్వీకరణ ఉంటుందని, దీన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో మధుసూదన్ పేర్కొన్నారు. సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 11 పంచాయతీలు ఉన్నాయని, ఆయా గ్రామపంచాయతీల్లో నామినేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. ఏదైనా ధృవకరణ పత్రం అవసరం ఉంటే వెంటనే అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎస్ఐ శ్వేత పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌తో.. ఉద్యోగులకు చిక్కులు

స్వస్తిక్ గుర్తుతో ఓటు హక్కు కల్పించాలని వినతి

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులకు సొంత ఊరిలో శత్రువుల సంఖ్య పెరగడంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో సదరు ఉద్యోగి అభ్యర్థి గుర్తుపై సంతకం చేసి తన ఓటుతో తన అభిప్రాయాన్ని తెలియజేస్తున్నాడు. పంచాయతీ ఎన్నికల్లో తక్కువ మంది ఓటర్లు ఉండడం వల్ల పోస్టల్ బ్యాలెట్‌ను తెరిచినప్పుడు ఆ ఓటు ఎవరికి వేశారో స్పష్టంగా తెలిసిపోతుంది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉపయోగించు కున్న ఉద్యోగికి స్థానిక సర్పంచు అభ్యర్థుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. దీని మూలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోస్టల్ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించు కునేందుకు జంకుతున్నారు. సామాన్య ఓటర్లకు ఇచ్చినట్లుగా బ్యాలెట్‌పేపర్‌తో పాటు స్వస్తిక్ సింబల్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని ఉద్యోగులు కోరు తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల ఓటింగ్ శాతం తగ్గిపోవడానికి ఇదే కారణం చూపుతూ ఓటింగ్‌కు దూరమవు తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులను సైతం సాధారణ ఓటర్లుగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

నిత్యన్నదానం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే, జీఎం



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న జీఎం రాధా కృష్ణ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు

మందమర్రిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హరిహర అయ్యప్ప ఆలయంలో సోమవారం మందమర్రి ఏరియా జీఎం రాధా కృష్ణ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కఠోర నియమ నిబంధనలతో కూడినది అయ్యప్ప దీక్ష అని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ప్రతి సంవ త్సరం ఇక్కడ భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. సింగరేణి తరుపున ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిత్యన్నదానానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. అనంతరం నిత్యన్నదానాన్ని జీఎం, మాజీ ఎమ్మెల్యేలు ప్రారంభించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ పట్వర్ధన్ మాట్లాడుతూ హెచ్ఐవీ చికిత్స లేని వ్యాధి అని తెలిపారు. దీనికి నివారణ ఒక్కటే మార్గమన్నారు. విద్యార్థులు ఎయిడ్స్ పట్ల శాస్త్రీయ విజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషా పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తాండూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధీర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు ఈర్ల సంతోష్ బీజేపీ పార్టీలో చేరారు. ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ సిద్దాంతాలకు ఆకర్షితులై ఈర్ల సంతోష్ బీజేపీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూడపాక భరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లాప్రధాన కార్యదర్శి ఎనగందుల కృష్ణమూర్తి, నాయకులు కుమార్, సతీష్, కార్తీక్, రవి, ఉపేందర్, హరీష్, అనిల్‌కుమార్, సంతోష్, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

సబ్ కలెక్టర్ మనోజ్



ధర్మారావుపేట నామినేషన్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్పంచు, వార్డు సభ్యుల నామినేషన్‌లు దాఖలు చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. సోమవారం ధర్మారావుపేటలోని నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు గుంపులుగా రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రంలో అన్ని వసతులు కల్పించి అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. నామినేషన్ పత్రాలను సక్రమంగా పరిశీలించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో సప్దర్ ఆలీ ఉన్నారు.

జైపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సర్పంచు, వార్డు సభ్యుల నామినే షన్‌ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్వో, ఏఆర్వో, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నామినేషన్ వేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు అభ్యర్థులకు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండలంలో నాలుగు నామినేషన్ కేంద్రాలు మిట్టపల్లి, జైపూర్, ఇందారం, శెట్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌వోలుగా నియమించబడిన వారు నామినేషన్‌ల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో బాపురావు పాల్గొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి, నీల్వాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు వేమన పల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ సాయి బాబ, ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీవో వెంకటేశ్, ఆర్ఐ ఖలిక్, ఉన్నారు.

భీమిని : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. తహసీల్దార్ బికర్ణ దాస్, ఎంపీడీవో గంగామోహన్, ఎంఈవో వెంకటస్వామి, సూపరింటెండెంట్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ గోపతి రవిందర్ ఉన్నారు.

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు సందర్శించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలను తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించారు. అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ద్వారా తగిన సూచనలు, సలహాలను అందించాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థిని మాత్రమే లోపలకి అనుమతించాలని సూచించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణంలోని కేకే ఓసీపీ సమీపంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ శ్మశాన వాటిక సాధన కమిటీ సభ్యులు సోమవారం మండల తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 60 ఏళ్లగా పాత బస్టాండ్, యాపల్, అంగడి బజార్ ఏరియాల ప్రజలు కేకే ఓసీపీ పక్కన అంత్యక్రియలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం శ్మశాన వాటిక నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. శ్మశాన వాటిక కోసం మూడు ఏరియాల్లోని ప్రతి ఇంటి నుంచి సంతకాలను సేకరించామని తెలిపారు. వెంటనే ఓసీపీ పక్కన శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

డీసీపీ భాస్కర్

జన్నారం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సజావుగా నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా చింతగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పూర్తి సాయిలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతా నిర్వహించాలని ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టామని అన్నారు. ప్రతి ఒకక్కరు ఎన్నికలకు సహకరించాలనిఅన్నారు. ఆయన వెంట ఎస్ఐ అనూషతోపాటు అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించిన, వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో విశేష కృషి ఉత్తమ సేవలందించిన అధికారులకు ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో అనిత అవార్డులు అందజేశారు. కాసిపేట వైద్యాధికారిణి శ్రీదివ్య, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, దీపక్‌నగర్ సీవో సురేఖ, ఐసీటీఎస్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి,నరేందర్, రాజేందర్‌లకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వేదవ్యాస్, ఆర్ఎంవోలు భీష్మ, శ్రీధర్, శ్రీమన్నారాయణ, హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి అరుణశ్రీ, క్లస్టర్‌ప్రోగ్రాం మేనేజర్ రమేష్, డెమో వెంకటేశ్వర్, సీహెచ్‌వోలు నాందేవ్, వెంకటేశ్వర్, డాటా మేనేజర్‌సంతోష్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి,రాజేందర్, అరుణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి సభ్యులు భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌లో వర్గ పోరు

-ఎమ్మెల్యే వినోద్ వర్సెస్ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిపత్యం సాధించేందుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గాల మధ్య పోరు తీవ్ర ఉత్కంఠ రేపు తుంది. మండలంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎవరు ఆసక్తి చూపకపోవడంతో కాంగ్రెస్ పార్టీ మధ్యనే ప్రధాని పోటీ నెలకొంది. మండలంలో 22 గ్రామపంచాయతీల్లో దాదాపు అన్ని స్థానాల నుంచి ప్రేమ్‌సాగర్‌రావు వర్గం అభ్యర్థులను పోటీలో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓరియంట్ సిమెంట్ ఎన్నికల్లో గడ్డం బ్రదర్స్ బలపర్చిన అభ్యర్థిపై ప్రేమ్‌సాగర్‌రావు తమ్ముడు సత్యపాల్‌రావు గెలిచి మంచి ఊపు మీద ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం అదే జోరు కొనసాగించేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. ప్రేమ్‌సాగర్‌రావు తన సొంత మండలంలో తన బ్రేడ్ మార్కును చూపించి ఎన్నిక ఏదైనా తిరుగులేని నాయకత్వాన్ని పదిల పర్చుకునేందుకు అన్నదమ్ములు ఇద్దరు కలిసి పనిచేస్తున్నారు. రెండు వర్గాల ఉత్కంఠ పోరులో ఎవరు పై చేయి సాధిస్తారో వేచి చూడాల్సిందే.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం..

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



లక్ష్మీపూర్‌లో వరి కళ్లాలను పరిశీలించి విచారిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

భీమిని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం దళారుల పాలు...నేటికీ ప్రాంభం కాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అనే అంశంపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. దీనిపై కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ సోమవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. దీనిపై రైతులు తమకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేదని తెలుపగా త్వరలో మండలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలలో సండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలని, దలారుళకు అమ్ముకోవద్దని సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి యమున దుర్గ, ఏఈఓలు కార్తీక్, అఫ్రోజ్, రైతులు పాల్గొన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

మందమర్రిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకర్‌పల్లి గ్రామంలోని సండ్రోన్‌పల్లిలో సోమవారం రాత్రి మెండ్రపు గోపాల్ (35)ను అతని తమ్ముడు మెండ్రపు కుమార్ రోకలి బండతో కొట్టి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూలీ పనులు చేసుకుని జీవించే అన్నాతమ్ముళ్ల మధ్య కొంత కాలంగా కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఆగ్రహంతో అన్న కుమార్ తన తమ్ముడు మెండ్రపు గోపాల్‌ను రోకలి బండతో కొట్టి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని సమీక్షించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టిన ఇంగ్లీష్ టీచర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



రామగుండంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ముందడుగు

మందమర్రిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత మైన రామగుండంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం రెండేళ్లుగా చేస్తున్న కృషి మరో ముంద డుగు పడిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. విలేకరులకు ఒక ప్రకటన పంపారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి విన్నవించామన్నారు. మొదట పరిశీలించిన భూమిలో కొండలు, గుట్టలు ఉండడంతో రిజెక్టు చేశారని తెలిపారు. మళ్లీ ఒత్తిడి చేసి కొత్త లొకేషన్‌పై సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 50 లక్షల ఫ్రీ ప్రిజబులిటి స్టడీ కోసం సెంటర్‌కు చెల్లించినట్లు తెలిపారు. ఈ స్టడీని వేగవంతం చేయడానికి పౌర విమానయాన శాఖ మంత్రిని కలిసి చర్చలు జరిపినట్లు తెలిపారు. డిసెంబరు 3, 4తేదీల్లో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా రామగుండం ప్రాంతాన్ని సందర్శించి కొత్త భూమిని సర్వే చేస్తుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు అయితే పెద్దపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్, రామగుండం, ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందన్నారు. దీనికి అందరు సహకరించాలన్నారు. రామగుండంలో ఎయిర్ పోర్టు పూర్తయ్యేంత వరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



ఎంపీ గడ్డం వంశీకృష్ణ

జర్నలిస్టులపై దాడులు అప్రజాస్వామికం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిత్య ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలపై కథనాలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు నానాటికి పెరిగిపోతున్నాయని జర్నలిస్టుల పై దాడులు హేయమైన చర్య అని మంచిర్యాల జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు తోట్ల మల్లేష్ యాదవ్, కార్యదర్శి చింతకింది మధుసూదన్ పేర్కొన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో వార్తలు ప్రచురించినందుకు బీఆర్ఎస్ నాయకులు బీ9 న్యూస్ కార్యాలయంపై దాడులు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఏవో రాజేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ముత్యం వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు ఓదెలు, రాజ్‌కుమార్, శ్రీధర్, సత్యం పాల్గొన్నారు.

- మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- ఉదయం, సాయంత్రం వేళల్లో అధికమవుతున్న చలి
- ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- పొగమంచు కారణంగా వాహనదారుల ఇక్కట్లు



పాత మంచిర్యాల సమీపంలో చలిమంట కాగుతున్న యువకులు

గజగజ..

మంచిర్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత మూడు రోజులుగా చలి విజృంభిస్తోంది. మూడు రోజుల నుంచి క్రమేపీ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ఈ యేడు ఇప్పటి వరకు లేని విధంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మరింతగా చలి పెరుగుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతల్లో కూడా మార్పులు జరగడంతో వాతావరణం చల్లబడుతోంది. ఉదయం 9 గంటల వరకు కూడా చలి ప్రభావం ఉండటంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచే చలి ప్రభావం కనిపిస్తోంది. తుఫాన్ కారణంగా శీతల గాలుల వీస్తుండటంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం అధికంగా ఉంటోంది.

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..

ఒకేసారి చలి తీవ్రత పెరగడంతో ముఖ్యంగా వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉదయం షిఫ్టుకు వెళ్లే సింగరేణి కార్మికులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా చలి ప్రభావం అధికంగా ఉంటోంది. విపరీతమైన చలి కారణంగా సింగరేణిలో కార్మికుల హాజరు శాతంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. పాలు, కూరగాయల వ్యాపారులు తెల్లవారు జామున ఐదు గంటలకే బయ టకు వెళ్లాల్సి రావడంతో చలి కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 10 గంటల వరకు కూడా రోడ్లపైకి జనాలు వచ్చేందుకు సాహసించడం లేదు.

పొగమంచుతో వాహన చోదకుల ఇబ్బందులు..

విపరీతమైన చలికి తోడు పొగమంచు కారణంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ మంచుతో.. (తరువాయి 7లో)

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఎంహెచ్‌వో అనిత పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎయిడ్స్ నియంత్రణ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 37 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని డిసెంబరు 1న జరుపుకుంటున్నామన్నారు. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా అనేక స్వచ్ఛంద సంస్థలు ఈ వ్యాధిపై అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపడుతారన్నారు. హెచ్ఐవీ సోకిన వారికి ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు అందు తాయన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేదవ్యాస్, ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్లు భీష్మ, శ్రీదర్, రెడ్‌క్రాస్‌సొసైటి సభ్యులు భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేందర్, కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొ న్నారు. సోమ వారం చెన్నూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలీ సులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించే పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందో బస్తు ఏర్పాటు చేస్తున్నామని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

అలాగే ప్రజలందరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగిం చుకునే లా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

స్థానిక పోరుపై యువత గురి
- సర్పంచ్‌గా పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి
- బరిలో నిలిచేందుకు నామినేషన్లు దాఖలు చేస్తున్న వైనం
7

నారు దశ.. జాగ్రత్తలే రక్ష
చలికాలంలో నారుమడులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
6

విద్యార్థులు, మహిళల భద్రతకు ప్రాధాన్యం

మహిళ స్టేషన్ సీఐ నరేష్



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా స్టేషన్ సీఐ నరేష్

నస్పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమ వారం షీటీమ్, మహిళ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు తదితర వాటిపై విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది చిన్నారులకు రక్షణ నిలుస్తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా షీ టీమ్ ఇంచార్జి ఎస్సై ఉషారాణి, మహిళా కానిస్టేబుల్ శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తరలిన కబడ్డీ జట్టు



పోటీలకు వెళ్తున్న బాలికల కబడ్డీ జట్టు

శ్రీరాంపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు నల్గొండ జిల్లా హాలియా గ్రామంలోని జోసెఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 51వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మంచిర్యాల జిల్లా బాలికల జూనియర్ కబడ్డీ జట్టు తరలివెళ్లింది. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లో జరుగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. రక్షిత(రామకృష్ణాపూర్), శ్రీజ (మైలారం), శృతి (మైలారం), వేదన సాయి(ఎల్లారం), వర్షిణి(గూళ్ల సోమారం), స్రవంతి (మందమర్రి), అక్షిత(నెన్నెల), స్పందన(కోటపెల్లి), వైష్ణవి (వేమనపల్లి), గీత (బోడపెల్లి), అవంతిక(పారిపెల్లి), హారిక(పార్డీ), కల్పన (అర్జున్ గుట్ట), అర్చన(ఒత్తపెల్లి), కోచ్ శివ, మేనేజర్ సంఘవి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు రాంచందర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసో సియేషన్ జిల్లా కార్యదర్శి కార్తీక్, రవీందర్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ల ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల, బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ అంశాలపై ని ర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, ఏర్పాట్ల పరిశీలన, బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, కౌంటింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారి శంకర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

రెండో రోజు 965 నామినేషన్లు

- సర్పంచ్ స్థానాలకు 256
- వార్డు సభ్యులకు 709 దాఖలు

మంచిర్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడుతలో రెండో రోజైన సోమవారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడుతలో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూరు, వేమనపల్లి మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా మండలాల్లోని మొత్తం 114 గ్రామ పంచాయతీలు, 996 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో రోజు ఆయా మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 256, వార్డు మెంబర్ స్థానాలకు 709 నామినేషన్లు దాఖలయ్యాయి.

బెల్లంపల్లి: రెండో విడత నామినేషన్లు సోమవారం రాత్రి వరకు సాగింది. బెల్లంపల్లి మండలంలో స ర్పంచ్ స్థానాలకు 46 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వీటితో పాటు వార్డు సభ్యులకు 134 మంది నామినేన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. 2వ రోజు నామినషన్ల దాఖలాల్లో భాగంగా ప్రదాన పార్టీల మద్దతుదారులతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు నామమాత్రం దాఖలాలు చేశారు.

కాసిపేట : పంచాయతీల ఎన్నికల్లో భాగంగా రెండవ రోజు సోమవారం మండలంలో జోరుగా నామినేషన్‌లు కొనసాగాయి. 22 గ్రామపంచాయతీల్లో 7 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్పంచుగా పోటీ చేసేందుకు 33 మంది అభ్యర్థులు నామి నేషన్‌లు వేయగా, 70 మంది వార్డు సభ్యులు నామినేషన్‌లు దాఖలు చేశారు.

నెన్నెల : మండలంలో పంచాయతీ ఎన్నికలకు రెండో రోజైన సోమవారం 19 జీపీల్లో మొత్తం 179 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచులకు 48, వార్డు సభ్యులకు 131 నామినేషన్లు వచ్చాయి. మొదటి రోజు సర్పంచ్‌కు 5, వార్డు మెంబర్లకు మూడు నామినేషన్లు రాగా రెండో రోజుతో కలుపుకొని మొత్తం సర్పంచ్‌లకు 53, వార్డు మెంబర్లకు 190 నామినేషన్లు వచ్చాయి. ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, ఎంపీవో శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో నామినేషన్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నీల్వాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తాండూర్ : తాండూర్ మండలంలో సోమవారం జోరుగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. అచ్చలాపూర్‌లో సర్పంచుకు 6, వార్డు సభ్యులు 15, బోయప ల్లిలో సర్పంచు 4, వార్డు మెంబర్లు 4, గోపాల్‌నగర్‌లో సర్పంచు 1, వార్డు సభ్యులు 2, కిష్టంపేటలో సర్పంచు 2, వార్డు సభ్యులు 9, మాదారంలో సర్పంచు 3, వార్డు సభ్యులు 17, మాదారం త్రిఇంక్లైన్‌లో సర్పంచు 2, వార్డు సభ్యులు 10, నర్సాపూర్‌లో సర్పంచులు 3, వార్డు సభ్యులు 5, నీలాయపల్లిలో సర్పంచు 2, వార్డు సభ్యు లు 9, రాజీవ్ నగర్ సర్పంచు 1, వార్డు స భ్యులు 10, రేచినిలో సర్పంచు 0, వార్డు సభ్యులు 1, చౌటపల్లిలో సర్పంచు 1 నామినే షన్‌లు దాఖల య్యాయి.

వేమనపల్లి: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో సోమవారం సర్పంచ్ స్థానాలకు 35 నామినేషన్లు, వార్డు స్థానాలకు 73 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు. బుయ్యారం గ్రామ పంచాయతీకి సర్పంచ్ స్థానానికి 2, వార్డు సభ్యుని స్థానానికి 8, చామనపల్లికి 2, వార్డు సభ్యుడి స్థానాలకు 0, దస్నాపూర్ సర్పంచ్‌కు 3, వార్డు సభ్యులకు 0, గొర్లపల్లి సర్పంచ్‌కు 4, వార్డు సబ్యులకు 0, జిల్లెడకు సర్పంచ్‌లకు 0, వార్డు సభ్యులకు 7, కల్లెంపల్లి సర్పంచ్‌కు 1, వార్డు సభ్యులకు 6, కేత నపల్లి సర్పంచ్‌కు 3, వార్డు సభ్యులకు 7, ముల్కలపేట సర్పంచ్‌కు 3, వార్డు సభ్యులకు 15, నాగారం సర్పంచ్‌కు 2, వార్డు సబ్యులకు 8, నీల్వాయి సర్పంచ్‌కు 2, వార్డు సబ్యులకు 3, రాజారం సర్పంచ్ 0, వార్డు 0, సుంపుటం సర్పంచ్‌కు 3, వార్డుకు 11, సూరారం సర్పంచ్‌కు 0, వార్డుకు 7, వేమనపల్లి సర్పంచ్ కు 2, వార్డుకు 0, నామినేషన్లు దాఖలయ్యాయి.

భీమిని : మండలంలో 12 గ్రామ పంచాతీలకు గానూ 28 మంది సర్పంచు, 70 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలాలు చేశారు. వీటిలో అక్కలపల్లి 2, భీమిని 2, కేస్లాపూర్ 3, చి న్నగుడిపేట 4, బిట్టూరుపల్లి 4, పెద్దపేట 2, ఖర్జీభీంపూర్ 0, లక్ష్మీపూర్ 0, మల్లీడి 6, చి న్నతిమ్మాపూర్ 1, వెంకటాపూర్ 2, వీగాం 2 సర్పంచు అభ్యర్థులు నామినేషన్లు దాఖలా లు చేశారు. సీఐ దేవయ్య, ఎంపీడీఓ గంగా మోహన్‌లు నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.

కన్నెపల్లి : మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు గాను సోమవారం సర్పంచుకు 30 నామినేషన్‌లు, వార్డు సభ్యు లకు 87 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో సదుపాయాలు లేవని..

మున్సిపల్ కార్యాలయం ముట్టడి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కూరగాయల వ్యాపారులు

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాత బస్టాండ్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో కనీస మౌలిక వసతులు లేవంటూ సోమవారం పట్టణ కూరగాయల, చిరు వ్యాపారులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన ఇంటిగ్రేటెడ్ భవన సముదాయంలో వసతులు లేవని వాపోయారు. 30 ఏళ్లుగా పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయం, గాంధీచౌక్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని రహదారులపై వ్యాపారం చేస్తూ పూట గడుపుతున్నామన్నారు. ఇప్పుడు మున్సిపల్ కమిషనర్ అత్యుత్సాహం ప్రదర్శించి ఎలాంటి వసతులు లేని సమీకృత మార్కెట్ భవనంలో కూరగాయల వ్యాపారం చేయాలని తమపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. సమీకృత భవనంలో మహిళలకు కనీస వసతులు లేవని, అక్కడే వ్యాపారం చేయాలని పేర్కొనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం సమీకృత భవనంలో అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న వ్యాపారులకు పోలీసులు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించివేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



సర్వాయిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య, పీడీ

కోటపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని రైతులు కేంద్రాలను వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఆర్‌డీవో పీడీ కిషన్‌లు పేర్కొన్నారు. మండలంలోని సర్వాయిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ఐకేపీ ఏపీఎం ఉమారాణి, సీసీలు జేక సునీత, నాగన్న, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

శ్రీరాంపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీమద్భగవద్గీత సత్సంగం సంస్థ 27వ వార్షికోత్సవం సందర్భంగా క్రిష్ణకాలనీ శివాలయ ప్రాంగణంలో సోమవారం గీతా జయంతి నిర్వహించారు. నెల రోజులుగా 18 పాఠశాలల నుంచి 18 మంది చొప్పు విద్యార్థులకు భగవద్గీత నేర్పించగా, ఈ వేడుకల్లో వారితో పారాయణం చేయించారు. ఈ సందర్భంగా హోమం చేపట్టగా, శ్రీరాంపూర్ సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి పాల్గొని పూర్ణాహుతి చేశారు. ఆధ్యాత్మిక బోధకులు మంతెన శ్రీనివాస్, సత్సంగం అధ్యక్షుడు దాసరి భక్త రాజేశం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. 32 ఏళ్లుగా శ్రీరాంపూర్‌తో పాటు పరిసర ప్రాంతాలలో భగవద్గీత నేర్పుతున్నట్లు చెప్పారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్సంగం కన్వీనర్ డీడీ ప్రసాద్, వేముల రాజమౌళి, లక్ష్మీ నారాయణ, బాలకృష్ణ, వెంకటేశం, దాసరి రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మెర 33కేవీ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. కొమ్మెర, ఆస్నాద, పొక్కూరు, దుగ్నేపల్లి గ్రామాల సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.